సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 23 । జూలై । 2024



సోమశిలలో 9.719 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 9.719 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రా)	రూ.75,490
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,761
3 శాతం జీఎస్టీతో	రూ.6,964
నవర (8 గ్రా)	రూ.55,712

గరిష్టం/కనిష్టం
35.1 /28.4

వాతావరణం

జిల్లాలో మంగళవారం అక్కడక్కడ ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉండి, పగలు వేడి ఎక్కువగా ఉంటుంది. వాతావరణంలో తేమ 61 శాతం ఉంది.

న్యూస్‌రీల్

విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలి



విద్యా వారోత్సవాల్లో ఏపీసీ ఉషారాణి

నెల్లూరు (టౌన్): శిక్షా సప్తాహను విజయవంతం చేయాలని సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాల్లో జిల్లా స్థాయి వారోత్సవాలను నిర్వహించారు. తొలుత అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్, బోధనోపకరణాలను పరిశీలించి అభినందించారు. అనంతరం నూతన జాతీయ విద్యావిధానం ఆవశ్యకతను కొనియాడారు. ఈ వారోత్సవాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఎంఓ సుధీర్‌బాబు, సీఎంఓ పెంచలయ్య, ఎంఈఓ మురళీధర్, హెడ్‌మాస్టర్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏపీ ఈఏపీ సెట్ తుది విడత కౌన్సెలింగ్

నెల్లూరు (టౌన్): ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి మంగళవారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకు రెండో విడత కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నారు. తొలివిడతలో రిజిస్ట్రేషన్ రుసుం చెల్లించని వారు ఈ విడత కౌన్సెలింగ్‌లో చెల్లించవచ్చు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.1200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.600 చెల్లించాల్సి ఉంటుంది. ఈ నెల 25వ తేదీ లోపు రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి. ఫీజు చెల్లించి, రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికే ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ ఉంటుంది. ఏమైనా సమస్య తలెత్తితే హెల్ప్‌లైన్ సెంటర్‌కు వెళ్లాల్సి ఉంటుంది. తొలి విడత కౌన్సెలింగ్‌లో సీటు పొంది, సీటు మార్చుకోవాలనే వారు ఈ విడతలో ఆప్షన్ ఎంపిక చేసుకోవచ్చు. ఈ నెల 26వ తేదీలోపు కళాశాల ఎంపికకు ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ పూర్తయి సీటు రాని వారితో పాటు కళాశాలలో సీటు వచ్చి ఇప్పటి వరకు చేరని వారు కూడా ఆప్షన్‌ను ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. ఏపీ ఈఏపీ తుది విడత కౌన్సెలింగ్ అడ్మిన్‌గా దంపూరి శివకుమార్ వ్యవహరించనున్నారు.

మాతృశాఖకు ఎంహెచ్‌ఓ వెంకటరమణ

నెల్లూరు (బారకాసు): నెల్లూరు నగర పాలక సంస్థ ఆరోగ్యశాఖాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ పి.వెంకటరమణను తన మాతృశాఖ అయిన వైద్యారోగ్యశాఖకు బదిలీ చేస్తూ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఈ నెల 16వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయం సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నగరంలోని మురళీకృష్ణ హోటల్లో ఆకస్మిక తనిఖీ పేరుతో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న విషయాన్ని వైద్యారోగ్యశాఖ టీబీ జాయింట్ డైరెక్టర్ గతంలో చేసిన విచారణలో నిర్ధారణ కావడంతో నివేదికను ఉన్నతాధికారులకు నివేదించారు. దీంతో పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆయన్ను మాతృశాఖకు బదిలీ చేసింది.

మోసపూరిత క్లైమ్‌లపై ప్రత్యేక దృష్టి

- ఐటీ శాఖ నెల్లూరు రేంజ్ జాయింట్ కమిషనర్ వంశీధర్



వంశీధర్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు, వ్యాపార సంఘ నాయకులు

నెల్లూరు సిటీ: ఉద్యోగులు, వ్యాపారులకు సంబంధించి మోసపూరిత క్లైమ్స్‌పై ప్రత్యేక దృష్టి సారించామని ఇన్‌కంట్యాక్స్ డిపార్ట్‌మెంట్ నెల్లూరు రేంజ్ జాయింట్ కమిషనర్ టీవీ వంశీధర్ తెలిపారు. నెల్లూరులోని రాంజీనగర్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అనుమానాస్పద లావాదేవీల మీద అవగాహన చేపట్టామన్నారు. అనుమానాస్పదంగా రీఫండ్స్ క్లైమ్‌లు చేస్తున్న వారి కోసం మా శాఖ తరఫున అవుట్ రీచ్ ప్రోగ్రాం ఏర్పాటు చేశామన్నారు. గతేడాది కూడా అమలు చేశామన్నారు. 2021–22లో ఫ్రాడ్ రిలేటెడ్‌కు సంబంధించి ఉద్యోగులను, వ్యాపారులను గుర్తించి నోటీసులు జారీ చేశామన్నారు. ఇందులో భాగంగా 16,500 కేసులు విచారించామన్నారు. 8,000 మందికి సంబంధించి ఫ్రాడ్ రిలేటెడ్ క్లైమ్స్‌ను ప్రభుత్వానికి రీఫండ్ చేశారన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం నాటికి రూ.140 కోట్లకు పైగా వసూలు చేసినట్లు తెలిపారు. ఫ్రాడ్ క్లైమ్స్ పెడితే ఐటీ శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఐటీ అధికారులు శరత్‌బాబు, బీకేడీవీ ప్రసాద్‌బాబు, సందీప్‌కృష్ణ, సీఏలు, డ్రాయింగ్ ఆఫీసర్స్, వాణిజ్య సంఘాల అధికారులు పాల్గొన్నారు.

సామాన్యుడి అభివృద్ధి జరగాలి

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చండి

- గత ప్రభుత్వం మాదిరిగా సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి
- జిల్లాలో పురోగతిలో ఉన్న ప్రాజెక్ట్‌లను పూర్తి చేయండి
- పారిశ్రామికాభివృద్ధికి చర్యలు చేపట్టండి
- జాబ్‌చార్ట్ విడుదల చేసి యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలి

సామాన్యుడి అభివృద్ధితోనే రాష్ట్ర ఆర్థికాభివృద్ధి సాధ్యం. ప్రతి కుటుంబానికి మెరుగైన ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పన ద్వారానే ఇది సాధ్యం. పేదింటి బిడ్డలు ఉన్నతంగా చదువుకునేందుకు అవకాశాలు కల్పించడం ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయి. విద్య, వైద్యం, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు ప్రభుత్వం దన్నుగా నిలిచినప్పుడే రాష్ట్రం పురోభివృద్ధి దిశగా అడుగులు వేస్తుంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇచ్చింది. అయితే ఇంతకు మించిన ప్రణాళికల ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించారు. ఇప్పుడు ఆ ప్రజలు ఆకాంక్షలను నెరవేర్చేందుకు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆ దిశగా అడుగులు వేయాలని కోరుతున్నారు.



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 'ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో గత ప్రభుత్వం కంటే సంక్షేమ పథకాలు మిన్నగా అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రచారం చేసింది. కొత్త ప్రభుత్వం కొలువైన తర్వాత తొలిసారిగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలపై ప్రత్యేక దృష్టి సారించింది. అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమం, ప్రతి ప్రాంతం అభివృద్ధికి బీజాలు వేసింది. గడిచిన ఐదేళ్లలో జిల్లాలో లక్షలాది కుటుంబాలు ఆర్థికంగా స్వావలంబన సాధించాయి. గత ప్రభుత్వం అందజేసిన దానికంటే అదనంగా సంక్షేమం, అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి కల్పన అందిస్తామని తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చింది. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు సామాన్యుడి ఆకాంక్షలకు అనుగుణంగా అసెంబ్లీలో తమ వాణి వినిపించాలి. ప్రజాసంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుని సామాన్యుడి అభ్యున్నతికి పాటుపడాలనే ఆకాంక్షను తెలియజేస్తున్నారు. నాడు–నేడు ద్వారా విద్య, వైద్య రంగానికి గత ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. ఈ ప్రభుత్వంలో కూడా సంక్షేమం, అభివృద్ధిని సమన్వయంతో చేయాలని ఆకాంక్షిస్తున్నారు.

పురోగతిలో ఉన్న ప్రాజెక్ట్‌లను పూర్తిచేయండి

గత ప్రభుత్వం చేపట్టిన సాగు నీటి ప్రాజెక్ట్‌లు పూర్తి చేస్తే జిల్లా సస్యశ్యామలం అవుతుందని సగటు రైతు ఆకాంక్షిస్తున్నాడు. ఇప్పటికే పురోగతిలో ఉన్న రూ.960 కోట్లతో సోమశిల– కండలేరు వరద కాలువ ఆధునికీకరణ, రూ.840.90 కోట్లతో సోమశిల హైలెవల్ లిఫ్ట్ కెనాల్ నిర్మాణం, రూ.99.08 కోట్లతో సోమశిల అప్రాన్ పనులు, రూ.99.95 కోట్లతో సర్వేపల్లి కాలువ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. రూ.3,743 కోట్లతో రామాయపట్నం పోర్టు పనులు తొలి దశ, రూ.288 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పూర్తి చేసింది. ఆయా పనులను పూర్తి చేసి సాగు, తాగునీరు అందించాలని రైతులు ఆకాంక్షిస్తున్నారు.

మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపాలి

జువ్వలదిన్నెలో సుమారు రూ.288 కోట్లతో నిర్మించిన ఫిషింగ్ హార్బర్‌తో జువ్వలదిన్నె సిరులదిన్నెగా మారనుంది. ఫిషింగ్ హార్బర్‌తో ద్వారా ఏటా అదనంగా 41 వేల టన్నుల మత్స్యసంపద లభించడంతో పాటు హార్బర్ ఆధారిత పరిశ్రమల ద్వారా మత్స్యకారులు అదనపు ఆదాయం పొందే మార్గాలకు గత ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేసి మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆ వర్గాల ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

పారిశ్రామికాభివృద్ధితో నిరుద్యోగానికి చెక్

జిల్లాలో దాదాపు చదువులు పూర్తి చేసి, ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులు దాదాపు 5 లక్షలకు పైగా ఉన్నట్లు సమాచారం. సువిశాలమైన తీరం వెంబడి ప్రత్యేక ఆర్థిక మండళ్లు.. భారీ పోర్టులు, వాటి అనుబంధ పరిశ్రమలతో పారిశ్రామిక హబ్‌గా ఉన్న జిల్లాలో పారిశ్రామికరంగ పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. ఓ వైపు పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన వాతావరణంతో పాటు ఆ రంగాన్ని ప్రోత్సహించే దిశగా కొత్త ప్రభుత్వం అడుగులు వేస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడి ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందుతాయి. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. జాబ్ చార్ట్ విడుదల చేయాలి. జిల్లాలో కృష్ణపట్నం పోర్టు సమీపంలో జరుగుతున్న క్రిస్‌సిటీ అభివృద్ధి, వెంకటాచలంలో పలు పరిశ్రమలు, నారంపేట పారిశ్రామికవాడ, రామాయపట్నం, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ అనుబంధంగా సుమారు 2 వేల ఎకరాల్లో పారిశ్రామిక హబ్, తెట్టు–ఉలవపాడు మధ్య కొత్త పరిశ్రమల నిర్మాణానికి గత ప్రభుత్వం బీజాలు వేసింది. వీటిని పూర్తి చేస్తే జిల్లాలో నిరుద్యోగ సమస్య తీరుతుంది.

పర్యాటకాభివృద్ధితో ఉపాధి కల్పన

జిల్లాలో విస్తారంగా తీరం ఉంది. ఆహ్లాదకరమైన వాతావరణంతో కూడిన బీచ్‌లు ఉన్నాయి. ఆయా బీచ్‌లను అభివృద్ధి చేయాలి. బీచ్‌ల కనెక్టివిటీ రహదారులు అభివృద్ధి పరిచి బీచ్‌ల ప్రాంతాల్లో రిసార్ట్ నిర్మాణాలు చేస్తే పర్యాటక రంగం ఎంతో అభివృద్ధి చెందుతుంది. తద్వారా రాష్ట్రానికి రాబడి, వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పన జరుగుతుందని జిల్లా ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

సంక్షేమ పథకాలకు ఎదురుచూపులు

మే, జూన్ నెలల్లో సంక్షేమ అందని లబ్ధిదారులు

రైతులు	2,14,667 మంది
విద్యార్థులు	4,10,779 మంది
మత్స్యకారులు	15,690 మంది
విద్యా దీవెన, వసతి దీవెన	4,69,865 మంది

జిల్లాలో మే, జూన్ నెలల్లోనే గత ప్రభుత్వంలో వివిధ వర్గాలు సంక్షేమ పథకాలు అందుకున్నాయి. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది ఆయా సంక్షేమ పథకాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన ప్రతి సంక్షేమ పథకాన్ని అమలు చేసి పేద వర్గాలకు ఆర్థిక వెసులుబాటు కల్పించాలి. గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగించాలి. వ్యవసాయ రంగానికి ఊతం ఇస్తూ ప్రతి రైతుకు పెట్టుబడి సాయం, ఇన్‌పుట్ సబ్సిడీ, సకాలంలో ఎరువులు, పురుగు మందులు ఆర్బీకేల ద్వారా అందించాలి. యాంత్రీకరణ సామగ్రి అందజేయాలి.

నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలి



రామాయపట్నం పోర్ట్‌కు అనుబంధంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నట్లు గతంలో ప్రభుత్వం చెప్పింది. కొత్త ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు కోసం తీసుకునే చర్యలపై శ్రద్ధ తీసుకోవాలి. దీని వల్ల మా వంటి వారికి ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వస్తాయి. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీ నెరవేర్చలేదు. నిరుద్యోగ భృతికి సంబంధించి విధి విధానాలు ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే బడ్జెట్ కేటాయింపులు ఉండేలా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలి.
– సుధీర్, కావలి

విద్యాదీవెన, వసతి దీవెన విడుదల చేయాలి



పేద, మధ్య తరగతి ప్రజల బిడ్డలు ఉన్నత చదువులు చదివేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఈ విద్యా సంవత్సరంలో ఇంకా నిధులు విడుదల చేయలేదు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో విద్యాదీవెన, వసతి దీవెన కింద తక్షణమే నిధులు విడుదల చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి. బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి.
– ఎస్కే రిహన, బీటెక్, ద్వితీయ సంవత్సర విద్యార్థిని, బుజబుజనెల్లూరు

వెలుగొండ జలాలతోనే మేలు



వెలుగొండ ప్రాజెక్ట్‌లో అంతర్భాగంగా ఉన్న పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పూర్తి చేస్తే ఉదయగిరి ప్రాంతంలో వేల ఎకరాల బీడు భూములు సస్యశ్యామలంగా మారుతాయి. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. వలసల నివారణ సాధ్యమవుతుంది. వ్యవసాయ రంగానికి గత ప్రభుత్వం ఎంతో దన్నుగా నిలిచింది. ఈ ప్రభుత్వం ఇప్పటి వరకు రైతులకు రైతు భరోసా ఇవ్వలేదు. గత ప్రభుత్వం రైతుల పేరుతో బీమా చెల్లించి పంట నష్టం జరిగితే పరిహారం చెల్లించింది. ఈ ప్రభుత్వం రైతులపై భారం వేయడం తగదు. – జి.వెంకటేష్, దుత్తలూరు

మెట్టలో రైలు కూతెన్నడో

దశాబ్దంన్నరగా పట్టాలెక్కని నడికుడి- శ్రీకాళహస్తి రైలు


- స్వప్నంగా మారిన ప్రకృతి ఒడిలో రైలు ప్రయాణం
- 2011 నుంచి జిల్లాలోని మెట్ట వాసులను ఊరిస్తూనే..
- ఐదు దశల్లో ఇప్పటి వరకు రెండు దశలే పూర్తి
- నేటి కేంద్రం బడ్జెట్‌పై ఆశలు

ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని రైలు కూత వినని మెట్ట ప్రాంత ప్రజలతో పాటు ప్రకాశం, గుంటూరు జిల్లాల్లోని మారుమూల ప్రాంతాలను కలుపుతూ ప్రారంభమైన నడికుడి–శ్రీకాళహస్తి రైలు మార్గం నిర్మాణ పనులు దశాబ్దంన్నర కాలంగా కలగా మిగిలాయి. ఐదు దశల్లో పూర్తి చేయాల్సిన పనుల్లో ఇప్పటి వరకు రెండు దశలు పూర్తయ్యాయి. మిగిలిన మూడు దశలు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి. అటవీ, కొండలు, కాలువలు, పంట పొలాల మధ్య ప్రకృతి ఒడిలాంటి మెట్టలో రైలు కూత ఎప్పుడనేది ప్రశ్నార్థకంగానే మారింది. మంగళవారం పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో ఈ మార్గానికి మోక్షం లభిస్తుందనే కొండంత ఆశలతో మెట్ట ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్నారు.

కావలి: జిల్లాలో కోస్తా రైలు మార్గానికి ప్రత్యామ్నాయంగా ఉమ్మడి గుంటూరు జిల్లా పల్నాడు నుంచి చెన్నై, తిరుపతి వెళ్లేందుకు నడికుడి–శ్రీకాళహస్తి రైలు మార్గం ఎంతో కీలకమైంది. రాష్ట్రంలో అత్యంత కీలకమైన ఈ మార్గంలో రైలు ప్రయాణం వినడమే కాని, ఐదు దశాబ్దాలుగా అనుభవ భాగ్యానికి నోచుకోవడం లేదు. ఎట్టకేలకు దశాబ్దంన్నర క్రితం పనులు ప్రారంభమైనా.. నిర్మాణ పనులు సా...గుతూనే ఉన్నాయి. వందలాది గ్రామాల్లోని లక్షలాది మంది ప్రజలకు సరికొత్త ప్రయాణ అనుభూతిని కల్పించే రైలు మార్గం కోస్తా ఆర్థిక ముఖ చిత్రాన్ని మార్చేయనుంది. మెట్ట ప్రాంతంలోని పంటలు రవాణా చేయడానికి, సిమెంట్, గ్రానైట్‌లను ఎగుమతి చేయడానికి దోహదపడుతుంది.

రెండు దశల పనులే పూర్తి

నడికుడి రైలు మార్గం ప్రారంభ రైల్వేస్టేషన్ పిడుగురాళ్ల నుంచి శావల్యాపురం వరకు మొదటి దశ నిర్మాణం పూర్తయి, విద్యుద్దీకరణ పూర్తి చేశారు. రెండో దశలోని గుండ్లకమ్మ–దర్శి మార్గం కూడా పూర్తవడంతో రైల్వే అధికారులు ఇప్పటికే 75 కి.మీ. వేగంతో రైళ్లు నడిపేలా ట్రయల్ రన్ కూడా పూర్తి చేశారు. మూడో దశ నిర్మాణ పనులే వివిధ దశల్లో ఉన్నాయి. వాస్తవానికి ఈ రైలు మార్గానికి నడికుడి–శ్రీకాళహస్తి అని పేరు అయినప్పటికీ ఉమ్మడి గుంటూరు జిల్లా పిడుగురాళ్ల–నెల్లూరు జిల్లా వెంకటగిరి నడుమే కావడం గమనార్హం. పిడుగురాళ్లకు మూడు కి.మీ. దూరంలో 'న్యూ పిడుగురాళ్ల జంక్షన్' పేరుతో రైల్వే శాఖ నూతన రైల్వేస్టేషన్‌ను నిర్మించింది. తొలి దశలో నడికుడి నుంచి శావల్యాపురం వరకు రూ.350 కోట్లతో ట్రాక్ నిర్మాణం పూర్తయి ట్రయిల్ రన్ పూర్తి చేశారు. తొలి దశ నిర్మాణం పూర్తి చేసుకొన్న ఈ మార్గంలో విద్యుత్ రైళ్లు నడవడానికి వీలుగా ట్రాక్ వెంబడి విద్యుద్దీకరణ పనులు జరుగుతున్నాయి.



నడికుడి- శ్రీకాళహస్తి రైలు మార్గం తెలియజేసే మ్యాప్

రైలు మార్గం నిర్మాణ ప్రణాళిక

నడికుడి– శ్రీకాళహస్తి రైలు మార్గం ఐదు దశాబ్దాల స్వప్నం. మూడు జిల్లాల పరిధిలో 309 కిలో మీటర్ల పొడవు కలిగిన ఈ రైలు మార్గం నిర్మాణానికి రూ.2,289 కోట్ల వ్యయం కానున్నది. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల సమాన భాగస్వామ్యంతో చేపట్టాల్సి ఉంది. 2011–12లో బడ్జెట్‌లో ప్రణాళికలు రూపొందించారు. మొత్తం 33 రైల్వేస్టేషన్లు, పెద్ద బ్రిడ్జిలు 126, చిన్న బ్రిడ్జిలు 392 నిర్మించాల్సి ఉంది. భూసేకరణ కూడా రాష్ట్ర ప్రభుత్వమే తన సొంత నిధులతో పూర్తి చేసి రైల్వేశాఖకు ఇవ్వాలి.

మొదటి దశ: ఉమ్మడి గుంటూరు జిల్లా పిడుగురాళ్ల నుంచి శావల్యాపురం వరకు 47 కి.మీ.
రెండో దశ: గుండ్లకమ్మ నుంచి దర్శి వరకు 27 కి.మీ.
మూడో దశ: దర్శి నుంచి కనిగిరి వరకు 52 కి.మీ., వెంకటగిరి నుంచి ఆల్తూరిపాడు వరకు 15 కి.మీ.
నాలుగో దశ: కనిగిరి–పామూరు 35 కి.మీ., ఆల్తూరిపాడు–వెంకటాపురం 43 కి.మీ.
ఐదో దశ: పామూరు–ఓబులాయపల్లె–వెంకటాపురం 90 కి.మీ.

అటకెక్కిన భూసేకరణ

నెల్లూరు జిల్లాలో ఈ రైలు మార్గానికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. ఒప్పందం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా వ్యయాన్ని భరించి భూసేకరణ చేసి రైల్వేశాఖకు అప్పగించాల్సి ఉంది. జిల్లాలో వరికుంటపాడు, కొండాపురం, కలిగిరి, వింజమూరు, ఏఎస్‌పేట, ఆత్మకూరు, చేజర్ల, పొదలకూరు, రాపూరు, డక్కిలి, వెంకటగిరి మండలాల్లోని 2,267.77 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ఇందులో ప్రభుత్వ భూమి 777.09 ఎకరాలు కాగా, మిగిలిన పట్టా భూములు 1,054.54 ఎకరాలు, అసైన్డ్ భూములు 436.14 ఎకరాలు గుర్తించారు. 1,590.68 ఎకరాల భూమికి సంబంధించిన యజమానులకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. అలాగే రైలు మార్గం నిర్మాణంలో అయ్యే ఖర్చులో సగం రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. రైలు మార్గం ఖర్చు రూ.2,289 కోట్లు. అందులో సగం రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.1,144.5 కోట్లు. జిల్లాలో భూసేకరణకు నిధులు మంజూరు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

జిల్లాకే మరింత ప్రయోజనం

ఈ రైలు మార్గం పొడవు 309 కి.మీ. కాగా, నెల్లూరు జిల్లాలో 146 కి.మీ. ఈ రైలు మార్గంలో మొత్తం రైల్వే స్టేషన్లు 33 కాగా, నెల్లూరు జిల్లాలో 15 ఉన్నాయి. గుంటూరు, ప్రకాశం జిల్లాల మీదుగా నెల్లూరు జిల్లాలో నిర్మిస్తున్న ఈ రైలు మార్గంలో జిల్లాలోనే ఎక్కువ స్టేషన్లు నిర్మించనున్నారు. వరికుంటపాడు మండలంలోని కొల్లువారిపల్లె, వింజమూరు మండలంలో గోళ్లవారిపల్లె, రావిపాడు, వింజమూరు గ్రామాల్లో రైల్వేస్టేషన్లు నిర్మిస్తున్నట్లు ప్రాజెక్ట్ నివేదికల్లో పొందుపరిచి ఉన్నారు. ఏఎస్‌పేట మండలంలో దూబగుంట, ఆత్మకూరు మండలంలో పమిడిపాడు, ఆత్మకూరు, చేజర్ల మండలంలో ఓబులాయపల్లె, కొత్తూరు, రాపూరు మండలంలో వెంకటాపురం, ఆదూరుపల్లి, రాపూరు, డక్కిలి మండలం వెల్లంపల్లి, ఆల్తూరుపాడు, వెంకటగిరి మండలంలో బాలసముద్రం గ్రామాల్లో రైల్వేస్టేషన్లను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు.

భారీగా ట్రాఫిక్ తగ్గుతుంది..

దేశంలో అత్యంత రద్దీగా ఉన్న రైల్వే మార్గాల్లో విజయవాడ– చెన్నై మార్గం ప్రాముఖ్యత సంతరించుకొంది. ఈ మార్గంలో ప్రయాణికులు రాకపోకలు సాగించే రైళ్లు, గూడ్స్ రవాణా చేసే రైళ్లు రోజుకు 1,000కి పైగా ఉన్నాయి. విజయవాడ కేంద్రంగా ఉన్న ఈ రైలు మార్గం ద్వారానే రైల్వే శాఖకు ఏటా రూ.5,000 కోట్ల పైగానే ఆదాయాన్ని సమకూర్చుతోంది. ఈ రైళ్ల ట్రాఫిక్ రద్దీని తట్టుకోలేక కేవలం గూడ్స్ రైళ్ల రాకపోకలు సాగించేందుకు మూడో రైలు మార్గాన్ని కూడా నిర్మాణం జరుగుతోంది. ఎక్కడా ఎటువంటి అంతరాయం లేకుండా సజావుగా, సవ్యంగా సాగుతుంటేనే విజయవాడ – చెన్నై రైలు మార్గం భారీ ట్రాఫిక్‌ను తట్టుకోలేకతోంది. నడికుడి–శ్రీకాళహస్తి రైలు మార్గం నిర్మాణం పూర్తయితే ఉపశమనం కలిగించే రైలు మార్గం అవుతుందని రైల్వే వర్గాలే చెబుతున్నాయి. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని పడమటి వైపున ఉన్న వేలాది గ్రామాల నుంచి సరుకు రవాణాకు, ప్రజలు ప్రయాణానికి ఈ మార్గం ఎంతో ఉపయోగపడుతుంది.

భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని ముందస్తు చర్యలు చేపట్టేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు కురిస్తే తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, తర్వాత చేపట్టాల్సిన చర్యలకు సన్నద్ధతగా ఉండాలన్నారు. ప్రధానంగా ఇరిగేషన్, పంచాయతీ, రెవెన్యూ, విద్యుత్‌శాఖలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువుల స్థితిగతులను పరిశీలించి అవసరమైన చోట చెరువు కట్టల మరమ్మతులు చేపట్టాలన్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలన్నారు. వర్షాల వల్ల ఎటువంటి ఇబ్బందులు వచ్చినా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్, డీఆర్‌ఓ లవన్న, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, ఇరిగేషన్, విద్యుత్, సోమశిల ఎస్ఈలు కృష్ణమోహన్, విజయన్, వెంకటరమణారెడ్డి, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

కుమారుడి ఆత్మహత్యకు వారే కారణం

- అవమానభారంతో దారుణం
- నారాయణ యాజమాన్యం, ఉపాధ్యాయులపై చర్యలకు తల్లిదండ్రుల వినతి


మాట్లాడుతున్న కృష్ణమూర్తి, అపర్ణ

నెల్లూరు(క్రైమ్): అవమానభారంతో మా కుమారుడు ఆత్మహత్య చేసుకున్నారు.. దీనికి నారాయణ యాజమాన్యం, ఉపాధ్యాయులే కారణం.. విచారణ జరిపి కఠిన చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు రామిశెట్టి కృష్ణమూర్తి, అపర్ణ కోరారు. ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ కృష్ణకాంత్‌కు వినతిపత్రాన్ని సోమవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. రమేష్‌రెడ్డినగర్‌లోని నారాయణ ఒలంపియాడ్ స్కూల్లో తమ కుమారుడు జయధర్ (15) పదో తరగతి చదివారని, విద్యలో చురుగ్గా ఉండటమే తమ కుమారుడి పాలిట శాపంగా మారిందన్నారు. జయధర్ సక్రమంగా చదవడం లేదని.. మంచి మార్కులొస్తున్నా రావడంలేదంటూ రోజూ ఏదో ఒక కారణంతో తమ కుమారుడ్ని అక్కడి టీచర్లు దూషించడంతో పాటు సూటిపోటి మాటలతో వేధించేవారని ఆరోపించారు. అందరి ముందు తమ కుమారుడ్ని ఈ నెల 16న కొట్టడంతో అవమానభారంతో తీవ్ర మనస్తాపానికి గురై, మరుసటి రోజు తాము ఇంట్లో లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారని చెప్పారు. ఘటనకు స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులే కారమమని ఫిర్యాదులో పేర్కొన్నా, 194 బీఎన్నెస్సెస్ (డెత్‌ఆజ్ నాట్ నోన్) కింద దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారని, దీనికి సదరు విద్యాసంస్థలు రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణవి కావడమే కారణమని ఆరోపించారు. విచారణ జరిపి కారకులపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. కాగా తగు న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారని వారు చెప్పారు.

కంపెనీలో వాటా పేరిట మోసం

నెల్లూరు(క్రైమ్): ఓ కంపెనీలో వాటా కల్పిస్తామంటూ కొందరు తన వద్ద రూ.1.8 కోట్లను తీసుకొని మోసగించారని.. ఆరాతీయగా సదరు కంపెనీ నకిలీదని తేలిందని.. ఈ వ్యవహారంలో విచారణ జరిపి న్యాయం చేయాలని వేదాయపాళేనికి చెందిన కార్తీక్ కోరారు. ఈ మేరకు నగరంలోని ఉమేషచంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ కృష్ణకాంత్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. మొత్తం 63 ఫిర్యాదులు అందగా, చట్టపరిధిలో విచారణ జరిపి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఏఎస్పీ క్రైమ్స్ ప్రసాద్, ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

- ఉలవపాడు మండలానికి చెందిన ఓ వ్యక్తి తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశారని, ఆయనపై చర్యలు చేపట్టాలని అదే ప్రాంతానికి చెందిన దివ్యాంగురాలు కోరారు.
- చదువు నిమిత్తం తన కుమార్తెను చెల్లెలు, మరిది ఇంట్లో వదిలిపెట్టానని, అయితే తనకు కాకుండా చేయడంతో పాటు వేధింపులకు గురిచేస్తున్నారని ఇస్కపల్లికి చెందిన వెంకటలక్ష్మి ఫిర్యాదు చేశారు.
- హత్యాయత్నం కేసులో నిందితులను త్వరితగతిన అరెస్ట్ చేయాలని నవాబుపేటకు చెందిన ఓ వ్యక్తి కోరారు.
- అదనపు కట్నం కోసం అత్తామామలు, భర్త వేధింపులకు గురిచేస్తున్నారంటూ నెల్లూరు నగరానికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.
- భర్త మరణానంతరం ఆయనకు సంబంధించిన ఆస్తి విషయమై అత్తింటి వారు వేధింపులకు గురిచేస్తున్నారని నెల్లూరు రూరల్ పరిధిలోని ఓ మహిళ ఫిర్యాదు చేశారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించండి

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్లోని శంకరన్ సమావేశ మందిరం నుంచి జిల్లాలోని ఎంపీడీఓలు, తహసీల్దార్లతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. కుల ధ్రువీకరణ పత్రాలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరగా మంజూరు చేయాలని సూచించారు. రాపూరు, బోగోలు మండలాల్లో రెవెన్యూ సర్టిఫికెట్లు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉన్న తహసీల్దార్లను రిలీవ్ చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మ్యుటేషన్లు పెండింగ్‌లో లేకుండా పరిష్కరించాలని, ఏమైనా సాంకేతిక సమస్యలుంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి సారించాలని.. గ్రామాల్లో డీఎల్పీఓలు, ఎంపీడీఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించాలని సూచించారు. కాలువల్లో పూడికతీత, పరిశుభ్రత కార్యక్రమాలను మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు రోజువారీ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని పారిశుద్ధ్య పనులను చేపట్టాలని చెప్పారు. పైప్‌లైన్ల లీకేజీల్లేకుండా చూడటంతో పాటు స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

జిల్లాలో ఆధార్ కార్డులకు నోచుకోని 10 వేల మంది ఎస్టీలకు అందజేసేలా ఆర్డీఓలు, సబ్ కలెక్టర్లు తగు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఆధార్ ప్రత్యేక క్యాంపులను ఈ నెల 23 నుంచి 27 వరకు ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. చిన్నారులకు నూతన ఆధార్ కార్డుల జారీ.. ఐదు నుంచి 15 ఏళ్లలోపు వారికి బయోమెట్రిక్.. 18 ఏళ్లపైబడిన వారి అప్‌డేషన్‌ను విరివిగా చేపట్టి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. జేసీ సేదు మాధవన్, డీఆర్వో లవన్న, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డీఎంహెచ్ఓ పెంచలయ్య, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పరిమళ, అడిషనల్ కమిషనర్ శేర్మద, డీఈఓ రామారావు, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కుమార్తెకు కిడ్నీ దానం


మాట్లాడుతున్న వైద్యులు

- కిమ్స్‌లో శస్త్రచికిత్స విజయవంతం

నెల్లూరు(అర్బన్): కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న యువతికి శస్త్ర చికిత్స చేసి తండ్రి కిడ్నీని తమ ఆస్పత్రిలో విజయవంతంగా అమర్చామని కిమ్స్ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి ఈడీ గిరినాయుడు పేర్కొన్నారు. నగరంలోని ఆస్పత్రిలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వివరాలను నెఫ్రాలజిస్ట్ సురేష్‌కుమార్‌రెడ్డి, యూరాలజిస్ట్ సురేష్‌కుమార్‌రెడ్డి తెలియజేశారు. ఇందుకూరుపేట మండలం కొత్తూరుకు చెందిన 24 ఏళ్ల వివాహిత మనీషా కిడ్నీ వ్యాధితో కొంత కాలంగా బాధపడుతున్నారని చెప్పారు. తమ ఆస్పత్రికి రాగా, అన్ని రకాల వైద్యపరీక్షల అనంతరం డయాలిసిస్ చేయాలని, తర్వాతి కాలంలో కిడ్నీని మార్చాల్సి వస్తుందనే విషయాన్ని తెలిపామన్నారు. అయితే డయాలసిస్‌కు ఆమె ససేమిరా అని, నేరుగా కిడ్నీ ఆపరేషన్‌ను చేయించుకుంటానని తెలియజేశారన్నారు. ఈ క్రమంలో కిడ్నీ దానానికి ఆమె తండ్రి మల్లిబాబు ముందుకొచ్చారని, పరీక్షల అనంతరం ఇవి సరిపోతుందనే అంశాన్ని నిర్ధారించామని చెప్పారు. ఆపరేషన్‌ను విజయవంతం చేశామని, ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగుండటంతో డిశ్చార్జి చేస్తున్నామన్నారు. నెఫ్రాలజిస్ట్ సతీష్‌రెడ్డి, అనస్థీషియా హెడ్ శేషయ్య, ఇంటెన్సివ్ అనస్థీషియాలజిస్ట్ జగదీష్, ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్ కుమార్, డీజీఎం శివమాల, మెడికల్ కో ఆర్డినేటర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



న్యూరో కేర్ యాప్ ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పెంచలయ్య, బిందుమేనన్ తదితరులు

నెల్లూరు(అర్బన్): ప్రపంచ బ్రెయిన్ డేను పురస్కరించుకొని మైగ్రేన్‌తో బాధపడే రోగుల కోసం న్యూరో కేర్ యాప్‌ను డీఎంహెచ్ఓ పెంచలయ్యతో కలిసి అపోలో ఆస్పత్రి న్యూరాలజీ విభాగాధిపతి బిందుమేనన్ సోమవారం ఆవిష్కరించారు. నగరంలోని అపోలో స్పెషాల్టీ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం బిందుమేనన్ మాట్లాడారు. యాప్‌లో రోగులు నమోదు చేసుకున్న సరాలు.. మైగ్రేన్ నొప్పులు తదితర ఆరోగ్య సమాచారం సంబంధిత వైద్యులకు అందుతుందని, దీని ద్వారా వైద్యాన్ని సకాలంలో అందించొచ్చని చెప్పారు. వివేకానంద ఎడ్యుకేషన్ సొసైటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరిశోధన బృందంతో కలిసి యాప్‌ను రూపొందించామని వివరించారు. రోగులు తమకు అవసరమైన రోజువారీ ఆరోగ్య చిట్కాలను పాటించేలా యాప్ దోహదపడుతుందని పేర్కొన్నారు. న్యూరోఫిజీషియన్లు రశ్మి, శివ, ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ శ్రీరామ్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫోర్జరీ కేసులో నిందితుల కోసం గాలింపు

- త్రుటిలో తప్పించుకున్న మేయర్ భర్త..?

నెల్లూరు(క్రైమ్): ఫోర్జరీ కేసులో నిందితుల కోసం దర్గామిట్ట పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. వివరాలు.. నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ల సంతకాల ఫోర్జరీ కుంభకోణంలో ఇద్దరు టీపీఓలు, మేయర్ భర్త, అతని సహాయకుడు, మరో ఇద్దరు సచివాలయ ఉద్యోగులపై దర్గామిట్ట పోలీసులు ఇటీవల కేసు నమోదు చేసిన విషయం విదితమే. ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్ విభిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. సాంకేతికత ఆధారంగా చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల్లో నిందితులున్నారని గుర్తించి ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. నిందితుల్లో ఒకరైన మేయర్ భర్త జయవర్ధన్ చెన్నైలోని ఓ హోటల్లో ఉన్నారనే పక్కా సమాచారం పోలీసులకు అందింది. దీంతో ప్రత్యేక బృందం చెన్నైకు సోమవారం చేరుకొని జయవర్ధన్‌ను అదుపులోకి తీసుకునేందుకు యత్నించగా, త్రుటిలో తప్పించుకున్నారని విశ్వసనీయ సమాచారం. అయితే ఆయన చెన్నై పరిసర ప్రాంతాల్లోనే ఉండొచ్చనే అనుమానంతో గాలింపు చర్యలను పోలీసులు కొనసాగిస్తున్నారు. కేసులోని సూత్రధారులు, పాత్రధారులను పోలీసులు త్వరలోనే అరెస్ట్ చేసే అవకాశం ఉంది.

రోడ్డుపై చికెన్ వ్యర్థాలు


చెల్లాచెదురుగా వ్యర్థాలు

సంగం: మండలంలోని గాంధీజనసంఘం సమీపంలో గల జాతీయ రహదారిపై చికెన్ వ్యర్థాలను రెండు వాహనాల్లో అక్రమంగా తరలిస్తుండగా, అందులో నుంచి ఒక డ్రమ్ము రోడ్డుపై పడింది. చెల్లాచెదురుగా పడటంతో దుర్గంధంతో స్థానికులు నానా పాట్లు పడ్డారు. ఈ క్రమంలో సమాచారం అందుకున్న ఎస్సై నాగార్జునరెడ్డి వెంటనే అక్కడికి చేరుకుని చికెన్ వ్యర్థాల వాహనాలను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. అనంతరం వాహనాలను సంగం కొండ సమీపానికి తీసుకొచ్చి వ్యర్థాలను గుంతల్లో పూడ్చించారు.

గాయపడిన వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి సోమవారం మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. తిరుపతికి చెందిన రవికుమార్ (40) కొంతకాలంగా రాజరాజేశ్వరి గుడి సమీపంలోని పోలీస్ కాలనీలో నివాసం ఉంటూ, నిప్పో సెంటర్ వద్ద సెలూన్ షాపును నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బుజబుజనెల్లూరు సమీపంలో తూర్పు వైపు నుంచి పడమర వైపునకు రోడ్డును ఆదివారం రాత్రి దాటుతుండగా, చెన్నై నుంచి నెల్లూరు వైపు వస్తున్న గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన్ను చికిత్స నిమిత్తం 108లో జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు ఏకేనగర్‌లో నివాసం ఉంటున్న మృతుడి బావమరిది వెంకటసుబ్బయ్య సౌత్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి కుమార్తె ఉన్నారు.

కలెక్టర్‌కే తప్పుడు సమాచారం

- ఇదీ ఏఎస్‌పేట తహసీల్దార్ తీరు
- బాధితులు ప్రశ్నించడంతో తప్పైందని వెల్లడి

అనుమసముద్రంపేట: పట్టా పొలానికి హద్దులు చూపకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుకొంటున్న అంశమై ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఆనంద్‌కు బాధితులు సోమవారం ఫిర్యాదు చేశారు. దీనిపై ఏకంగా కలెక్టర్‌కే తహసీల్దార్ తప్పుడు నివేదిక ఇచ్చారు. అవాక్కైన బాధితులు స్థానిక కార్యాలయానికి వచ్చి నిలదీయగా, తప్పైందని తహసీల్దార్ అంగీకరించారు. వివరాలు.. అనుమసముద్రంపేట మండలం తెల్లపాడుకు చెందిన వల్లెం వెంగమ్మ తన పట్టా పొలానికి హద్దులు చూపాలంటూ రెవెన్యూ అధికారుల చుట్టూ ఏడు నెలలుగా ప్రదక్షిణలు చేస్తున్నారు. దీనిపై కలెక్టర్‌కు పలుమార్లు అర్జీలను సమర్పించారు.

కొత్త కలెక్టరైనా సమస్యను పరిష్కరిస్తారని ఆశించారు. ఈ క్రమంలో ఏఎస్‌పేట తహసీల్దార్ రవికుమార్‌కు కలెక్టర్ వెంటనే వర్చువల్ కాల్ చేసి మాట్లాడారు. అది పట్టా పొలమైనా, ఎన్నో ఏళ్లుగా అందులో కాలిబాట ఉందంటూ అబద్ధం చెప్పడంతో బాధితులు అవాక్కయ్యారు. తహసీల్దార్ గతంలో తమకు ఇచ్చిన సమాచారం.. కలెక్టర్‌కు వెల్లడించిన సమాచారం పూర్తి విరుద్ధంగా ఉండటంతో హుటాహుటిన ఏఎస్‌పేటకు వచ్చి బాధితులు ప్రశ్నించారు. దీంతో తప్పైందని.. మీ పట్టా పొలానికి హద్దులు చూపుతానని తహసీల్దార్ వెల్లడించారు.

బాధితుల ఆవేదన

తెల్లపాడులోని సర్వే నంబర్ 398 / 4లో కొంత పట్టా భూమి ఉంది. తమ ఇంటి పక్కనున్న రహదారి నుంచి పొలానికి వెళ్లేందుకు చిన్న రహదారి ఉంది. అయితే ఈ రహదారిని గ్రామానికి చెందిన లెక్కల విజయభాస్కర్‌రెడ్డి ఆక్రమించుకునేందుకు ఆర్నెల్లుగా యత్నిస్తున్నారు. టీడీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడ్డాక దాడులు చేస్తామనడంతో పాటు రహదారిని గ్రామ పంచాయతీలో కలుపుకొంటామని బెదిరిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాద కారకుడికి ఆర్నెల్ల జైలు

దుత్తలూరు: రోడ్డు ప్రమాదంలో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఆర్నెల్ల జైలుతో పాటు రూ.వెయ్యి జరిమానాను విధిస్తూ ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి అంజయ్య సోమవారం తీర్పు చెప్పారు. వివరాలు.. దుత్తలూరు మండలంలోని వెంకటంపేట వద్ద 2016, మే 31న నిర్వహించిన ఆంజనేయస్వామి ఉత్సవాలకు చేజర్ల మండలం పల్లపునాయుడుపల్లికి చెందిన రావిళ్ల శివరామయ్య, ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లికి చెందిన పెట్లూరి కౌశిక్ వచ్చారు. అనంతరం వారు బైక్‌పై తిరిగెళ్తుండగా, దుత్తలూరు నుంచి కడప జిల్లా బద్వేలుకు బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ నందిపాడు సెంటర్ వద్ద ఢీకొంది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరూ మృతి చెందారు. ఘటనపై అప్పట్లో కేసు నమోదు చేశారు. డ్రైవర్ దర్శి రాజేష్ అతివేగంగా వాహనాన్ని నడిపి వారి మృతికి కారణమయ్యారనే అంశం విచారణలో రుజువైంది. దీంతో పైమేరకు శిక్ష, జరిమానా విధించారు. ఏపీపీ సుకన్య కేసు వాదించారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.65
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.35

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 135
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 268
లేయర్ చికెన్	: 178

వెల్లువెత్తిన అర్జీలు

నెల్లూరు(దర్గామిట్ట): ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వినతులు వెల్లువలా వచ్చాయి. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అర్జీలను కలెక్టర్ ఆనంద్ స్వీకరించారు. వీటిని ఆయా శాఖల అధికారులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. దివ్యాంగులు, వృద్ధుల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని సూచించారు. జేసీ సేదు మాధవన్, డీఆర్వో లవన్న, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డీఈఓ రామారావు, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీఎంహెచ్ఓ పెంచలయ్య, ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణమోహన్, డీటీసీ చందర్, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

- కృష్ణపట్నం పోర్టు సమీపంలో చేపలు పట్టనివ్వకుండా గిరిజనులను అడ్డుకుంటున్నారని, ఈ క్రమంలో జీవన భృతి లేకుండాపోవడంతో పాటు ప్యాకేజీని సైతం ఇవ్వడం లేదని ఏపీ యానాదుల సంక్షేమ సంఘ చైర్మన్ శేఖర్, వెంకటేశ్వర్లు, శీనయ్య విన్నవించారు.
- ఆత్మకూరు మండలం బండారుపల్లిలో తన ఐదెకరాల పొలాన్ని ఆక్రమించారని, దీన్ని తమకు ఇప్పించాలని చెన్నకృష్ణమ్మ విజ్ఞప్తి చేశారు.
- ఇందుకూరుపేట మండలం పేడూరుకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తనైన తనను బలవంతంగా తొలగించేందుకు యత్నిస్తున్నారని, ఉద్యోగ భద్రత కల్పించాలని సుమ కోరారు.

సేల్స్‌మెన్‌పై చీటింగ్ కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఎరువుల విక్రయ తాలూకు నగదును దుర్వినియోగం చేసిన ఘటనలో సేల్స్‌మెన్ కమ్ క్లర్క్‌పై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. స్టోన్‌హౌస్‌పేటలోని డీసీఎమ్మెస్ రిటైల్ ఫెర్టిలైజర్ షాపులో సేల్స్‌మెన్ కమ్ క్లర్క్‌గా నిరంజన్‌రెడ్డి విధులు నిర్వర్తించారు. ఆ సమయంలో ఎరువుల విక్రయ తాలూకు రూ.7,49,524 నగదు దుర్వినియోగమైంది. గతేడాది రికార్డుల వెరిఫికేషన్‌లో ఈ విషయం వెలుగులోకి రావడంతో సొసైటీ అధికారులు అతనిని నిలదీయగా, పలు దఫాలుగా రూ.3.5 లక్షలను చెల్లించారు. మిగిలిన నగదు చెల్లించకుండా కాలయాపన చేయసాగారు. దీంతో సదరు సేల్స్‌మెన్‌పై చర్యలు చేపట్టాలంటూ డీసీఎమ్మెస్ బిజినెస్ మేనేజర్ వెంకటస్వామి నవాబుపేట పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఆయన సస్పెన్షన్లో ఉన్నారని సమాచారం.